క్లుప్తంగా

నూకాలమ్మకు స్వర్ణవర్ణ నాగాభరణం సమర్పణ



నూకాలమ్మ ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ వారికి పట్టణానికి చెందిన పెన్మత్స రాజంరాజు, నాగలక్ష్మీదేవి కుటుంబ సభ్యులు రూ.25 వేలు విలువైన స్వర్ణవర్ణ నాగాభరణం సమర్పించారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సందర్భంగా తొలుత అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించామన్నారు. ఈ నెల 12న ఆలయ యాగశాలలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా 75వ చండీ హోమం నిర్వహిస్తామని వెల్లడించారు.

కామవరపుకోట ఎంపీడీఓగా సుజాత



ఎంపీడీఓ సుజాతకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

కామవరపుకోట: స్థానిక ఎంపీడీఓగా వై.సుజాత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె దెందులూరు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేసిన ముళ్ళగిరి సరళకుమారి ఈవోపీఆర్‌డీగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది సుజాతకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేయడానికి కృషి చేస్తానని సుజాత తెలిపారు.

పల్లకీలో ఊరేగిన ఆదిశంకరాచార్యులు



గ్రామోత్సవానికి పయనమైన ఆదిశంకరాచార్యులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదిశంకరాచార్యుని జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. క్షేత్రపాలకుని ఆలయంలో ముందుగా అర్చకులు, పండితులు ఆదిశంకరాచార్యుని ఉత్సవ మూర్తికి విశేష పుష్పాలంకారాలు చేశారు. గర్భాలయంలో శివదేవుని వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీ వాహనంలో ఆదిశంకరాచార్యుని ఉత్సవమూర్తిని ఉంచి క్షేత్ర వీధుల్లో ఊరేగించారు. అర్చకులు ఆదిశంకరాచార్యుని విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయానికి చేరుకున్న తరువాత శంకరాచార్యుని ఉత్సవ మూర్తికి, గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పనులు కల్పించాలని వినతి

టి.నరసాపురం: ఉపాధి హామీ పనులు కల్పించాలని బంజారా భజరంగీ భేరి సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ మణికుమారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గిరిజన గ్రామమైన కృష్ణాపురం తండాలో లంబాడీలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వ్యవసాయ సీజన్ పనులు మొదలయ్యే వరకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. దీనికి ఎంపీడీఓ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా సాహిత్య కళా ఉత్సవం



వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (స్టాంప్స్ – రిజిస్ట్రేషన్) లంకా వెంకటేశ్వర్లు ఉద్యోగ, సాహిత్య రంగాలకు సమన్యాయం చేశారని వక్తలు ప్రశంసించారు. వెంకటేశ్వర్లు పదవీ విరమణ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో సాహిత్య కళా ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి కొప్పర్తి వెంకట రమణ మూర్తి మాట్లాడుతూ విభిన్న రంగాల్లో రాణించడం ద్వారా సాహిత్యానికి, జీవితానికి, వ్యక్తిత్వానికి మధ్య ఉన్న సరిహద్దులను వెంకటేశ్వర్లు చెరిపివేశారని కొనియాడారు. ప్రముఖ సాహితీ విమర్శకుడు గుంటూరు లక్ష్మీ నరసయ్య, ప్రపంచ తెలుగు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జీవీ పూర్ణచందు, ప్రముఖ సినీ గేయ కవి రసరాజు, ప్రముఖ సినీ విమర్శకుడు ఎస్వీ రామారావు మాట్లాడారు. ప్రముఖ సాహితీవేత్తల వ్యాసాలతో ప్రచురించిన మట్టి పువ్వైన వేళ అభినందన సంచికను విడుదల చేశారు.

తడికలపూడి పీహెచ్‌సీకి సుస్తీ

- ఒకే గదిలో రెండు శాఖల విధులు
- సిబ్బంది, రోగులకు ఇబ్బందులు



పాత భవనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి



ఆసుపత్రి ఆవరణలో బయటి వ్యక్తులు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

కామవరపుకోట: మండలంలోని తడికలపూడి పీహెచ్‌సీలో డాక్టర్లు అందుబాటులో లేక ఎనిమిది గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడున్న ఇద్దరు మెడికల్ ఆఫీసర్లలో ఒకరు వివిధ సర్వేల పేరుతో క్యాంపులకు వెళుతుండగా, మరొకరు కామవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తడికలపూడి పీహెచ్‌సీకి వచ్చే రోగులు వైద్యులు లేక వెనుదిరిగి వెళ్లిపోవాల్సి వస్తోంది. హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ భవనం శిథిలావస్థలో ఉండడం, ఉన్న ఒక్క గదిలో ఆసుపత్రి సిబ్బంది, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పర్యవేక్షణ ఏదీ?

కామవరపుకోట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ కేంద్రానికి వచ్చేందుకు దూరాభారం కావడంతో తడికలపూడి చుట్టుపక్కల 8 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వైఎస్సార్ సీపీ హయాంలో తడికలపూడిలో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేశారు. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లను నియమించారు. ఆసుపత్రి భవన నిర్మాణానికి పోలీస్ స్టేషన్ సమీపంలో సుమారు రెండెకరాల స్థలం కేటాయించారు. అప్పటిలో అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలను తడికలపూడిలో ఉన్న హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ భవనంలో ప్రారంభించారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో అక్కడక్కడా శ్లాబు నుంచి పెచ్చులూడి దర్శనమిస్తుంది. ఇక్కడున్న ఒకే గదిలో ఆసుపత్రి సిబ్బంది, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ సిబ్బంది విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోగులు కూర్చోవడానికి సరైన సదుపాయాలు లేవు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఆస్పత్రి ఆవరణ పగలు ద్విచక్ర వాహనాలకు పార్కింగ్‌గా, రాత్రయితే అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రికి భవనం నిర్మించాలని, రోగులకు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఐతే, భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో ఆసుపత్రిని వేరొక భవనంలోకి మార్చి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య శాఖ అధికారి చెబుతున్నారు.

భవనం నిర్మించాలి



తడికలపూడి చుట్టుపక్కల ప్రాంత ప్రజల సౌకర్యార్థం కొత్త భవనం నిర్మించాలి. ఆసుపత్రి భవనం పాతది కావడంతో వైద్య సిబ్బంది, రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో పోలీస్ స్టేషన్ సమీపంలో కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– కడిమి రమేష్, జెడ్పీటీసీ, కామవరపుకోట మండలం

సదుపాయాలు కల్పించాలి



ఆసుపత్రికి వచ్చే రోగులకు సరైన సదుపాయాలు కల్పించాలి. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండేలా చర్య తీసుకోవాలి. పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అత్యవసర వైద్య సేవలైనా అందేలా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేయాలి.

– దాసి సుందర్ పాల్, వైయస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, వీరిశెట్టిగూడెం గ్రామం

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: మండలంలోని రేచర్ల గ్రామంలోని సారా శిబిరాలపై దాడి చేసి ఒక మహిళలను అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారా, అరకేజీ బెల్లం, 250 గ్రాముల మూరియా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. 20 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. చింతలపూడి సుప్రీంపేటలోని ఓ మహిళను అరెస్ట్ చేసి, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు, సారా సరఫరా చేసిన కోటమర్తి బాలకృష్ణపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. రేచర్ల, పట్టాయిగూడెం గ్రామాల్లోని సారా శిబిరాలపై దాడి చేసి ఇద్దరు మహిళల నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: స్థానిక పేరంపేట రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. అయ్యప్ప టౌన్‌షిప్, పేరంపేట రోడ్డు, బాటగంగమ్మ లే ఔట్ కాలనీ, పేరంపేట రోడ్డులో ఉన్న ఇండస్ట్రియల్ సర్వీసులకు విద్యుతు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బోడిగూడెం ఫీడర్ పరిధిలో..

కొయ్యలగూడెం: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శనివారం మండలంలోని బోడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహమ్మద్ పేర్కొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం



బుట్టాయగూడెం : కె.బొత్తప్పగూడెంలో మాట్లాడుతున్న సీడీపీఓ తులసి



జంగారెడ్డిగూడెం : కిశోర వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించిన ఐసీడీఎస్ అధికారులు

బుట్టాయగూడెం: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ ఏలూరు తులసి అన్నారు. బుట్టాయగూడెం మండలం కె.బొత్తప్పగూడెంలో శుక్రవారం నిర్వహించిన కిశోర వికాసం – వేసవి శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీడీపీఓ మాట్లాడుతూ లింగ వివక్షను రూపుమాపాలని, బాల్య వివాహాలను అరికట్టాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆడ పిల్లలపై అగాయిత్యాలు, దురాచారాలను రూపుమాపేందుకు, భ్రూణ హత్యలు, బాలికల అక్రమ రవాణాను అరికట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి విద్యార్థినులకు అవగాహన కలిగించాలని అన్నారు. కిశోర వికాసం 2.0 కార్యక్రమంలో ప్రతి గ్రామస్థాయిలో యుక్త వయస్సు బాలికలకు వేసవికాలంలో ప్రత్యేక శిబిరాలను మే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎన్వీ సత్యవతి, ఏఎన్‌ఎం కె.కుమారుదేవి, ఆశ వర్కరు పి.అక్కమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సీతారత్నం, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక, ఆరోగ్య అంశాలపై అవగాహనే లక్ష్యం

జంగారెడ్డిగూడెం: లింగ వివక్షత, ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాల్లో అవగాహన కల్పించేందుకు కిశోర వికాసం 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ పి.బ్యూల తెలిపారు. స్థానిక సచివాలయం–1 పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రం–58 లో కిశోర వికాసం కార్యక్రమాన్ని శుక్రవారం బ్యూల ప్రారంభించారు. కిశోర వికాసం జూన్ 10 వరకు ప్రతి గ్రామంలో మంగళ, శుక్రవారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బాలికలు ఒకరినొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం, రుతుక్రమం పరిశుభ్రత, లైంగిక విద్య, బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, బాలల హక్కులు, చట్టాలు, రక్తహీనత, లింగ వివక్షత, అసమానతలు, ఉన్నత విద్య, నైపుణ్యాలు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు, కౌమార బాలికల నాయకత్వం, సాధికారత, శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యత తదితర విషయాలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. కిషోర బాలికలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వార్డు కౌన్సిలర్ పి.గంగ, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి డి.గీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బయ్యన్నగూడెంలో..

కొయ్యలగూడెం: బయ్యనగూడెం సచివాలయంలో ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ సంయుక్తంగా కిశోర బాలికల వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, చిన్న వయస్సులో వివాహం చేసుకుంటే, స్త్రీకి పిల్లల్ని కనటానికి తగిన విధంగా గర్భశయం ఉండదని అధికారులు వివరించారు. త్వరగా తల్లి రక్త హీనతకు గురవుతారని తెలిపారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా పోలీస్, కిషోర బాలికలు పాల్గొన్నారు.

కగార్ ఆపరేషన్ నిలిపివేయాలి



ప్రదర్శన చేస్తున్న సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

జంగారెడ్డిగూడెం: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా కర్రిగుట్ట అడవులను చుట్టుముట్టడాన్ని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పి.శ్రీనివాస్ ఖండించారు. ఆపరేషన్ కగారును వెంటనే నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు నిర్వహించాలని న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం జంగారెడ్డిగూడెంలో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాశ్మీర్లో టూరిస్టులకు, ప్రజలకు భద్రత కల్పించడంలో విఫలమైన ప్రభుత్వం కర్రిగుట్ట అడవుల్లో మాత్రం 10 వేల మందికి పైగా సైన్యాన్ని దింపి ఆదివాసులను, మావోయిస్టులను హతమార్చడానికి కూంబింగ్ చేయడం దుర్మార్గమన్నారు. అటవీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టి కేంద్రం చర్యలను కట్టడి చేస్తునందుకే మావోయిస్టులను, ఆదివాసీలను హతమార్చడానికి కగారు పేరుతో ఏకపక్ష దాడులకు పూనుకుంటున్నదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కారం రాఘవ, కేవీ రమణ, సరియం రామ్మోహన్, కె.లత, ఈ భూషణం, వి.సద్గురు, తగరం బాబురావు, కట్టం నాగేశ్వరరావు, న్యాయవాది బాషా శ్యాంబాబు, నడపల మక్కా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురునాథరావుకు సన్మానం



గురునాథరావును సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పెద్దలు

జంగారెడ్డిగూడెం: మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులుగా నియమితులైన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావును జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణులు శుక్రవారం సత్కరించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో చింతలపూడి నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు, సంఘం జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడు ఎల్లా శ్రీను, మాజీ అధ్యక్షులు నడింపల్లి సత్యనారాయణ, మల్లవరపు నాగ పొసు, ఉప్పలపు నాగేశ్వరరావు, శిలరపు మంగారావు, వైస్ ప్రెసిడెంట్ తాడి శ్రీను, యూత్ అధ్యక్షులు శిలరపు ప్రశాంత్, నడింపల్లి నాగు ఉన్నారు.

- గురున్నాథరావును వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణ, ఏలూరు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు గుర్రాల రవి కుమార్, కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ నానాది సాగర్, పార్టీ తడికలపూడి సీనియర్ నాయకులు వెర్రు శ్రీను బాబు, సత్యనారాయణ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.
- జంగారెడ్డిగూడెం పట్టణం, మండలానికి చెందిన భావన రుషి, అట్లూరి శ్రీనివాసు, సత్రం వెంకట్రావు, చనమాల రాజేష్ తదితరులు జెట్టిని అభినందించారు.

హమాలీలకు పని భద్రత కల్పించాలి



జంగారెడ్డిగూడెంలో అరుణపతాకాన్ని ఎగురవేస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన చట్టం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కేవీ రమణ డిమాండ్ చేశారు. మే 1 నుంచి 7 వరకు నిర్వహించే మేడే వారోత్సవాల్లో భాగంగా స్థానిక పొగాకు బోర్డులో మేడే జెండాను ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు సరియం రామ్మోహన్ ఎగరవేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ హమాలి, భవన నిర్మాణ తదితర అసంఘటిత కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత కూడా చట్టం చేస్తానని గతంలో పార్లమెంట్‌లో నాటి కార్మిక శాఖ సహాయ మంత్రి బండారు దత్తాత్రేయ ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయకపోగా, కార్మిక రక్షణ చట్టాలను ఎత్తివేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బైరెడ్డి రాము, వాసుబోయిన శ్రీను, రొయ్యల పెద్ద శ్రీను, రొయ్యల శ్రీను, తన్నారి మధు, ఇమ్మంది రాము, బంగారు సత్తిబాబు, కె.నూకరాజు, గుంజే అన్నవరం, పెదపూడి వెంకన్న, రోంగాల శ్రీను పాల్గొన్నారు.

ప్రజల హక్కులను హరిస్తున్న కేంద్రం

బుట్టాయగూడెం: కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులను అణచివేస్తోందని ఏఐకేఎమ్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్ముల సురేష్ అన్నారు. మండలంలోని దొరమామిడిలో మేడే వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక పక్క నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచుతూ, మరో పక్క ప్రజలకు ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. వడ్లమూడి వెంకటేశ్వరరావు, కె.నాగరాజు, కె.శ్రీను, భాను, జెడ్డి సురేష్, కొమరం నాగార్జున పాల్గొన్నారు.

కనులపండువగా శివ కల్యాణం



శివదేవుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని శివదేవుని కల్యాణం శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో శోభాయమానంగా అలంకరించారు. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం కల్యాణ తంతును ప్రారంభించి, సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. సుముహూర్త సమయంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను వైభవంగా జరిపి, కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు.

శ్రీ రామానుజ రథయాత్ర



ముడిచర్లలో నిర్వహిస్తున్న శ్రీరామానుజ రథయాత్ర

లింగపాలెం: సమతా మూర్తి, జగదాచార్యులు భగవద్రామానుజాచార్యుల వారి తిరునక్షత్రం (జయంతి) సందర్భంగా లింగపాలెం మండలానికి చెంది భక్తి ఆధ్యాత్మిక సేవా సంస్థ భాగవత సదనం వారు ఆసన్నగూడెం నుంచి రంగాపురం వరకు ఆచార్యులవారిని ఊరేగిస్తూ రథయాత్ర నిర్వహించారు. భక్తులు, భాగవతులచే రామానుజ సంకీర్తనలు, దారి పొడవునా పులిహోర, మజ్జిగ ప్రసాద వితరణలతో సుమారు 5 కిలో మీటర్ల వరకు ఈ యాత్ర కొనసాగింది. స్థానిక రంగాపురం సత్యనారాయణ స్వామి ఆలయ ప్రదక్షిణతో కైంకర్యానికి ముగింపు పలికారు. స్థానిక వేములపల్లి, ముడిచర్ల, రంగాపురం గ్రామాల్లో చలివేంద్రాలను ప్రారంభించారు. భాగవత సదన ఆచార్యులు శ్రీమాన్ తిరుక్కోవళ్లూరి శ్రీనివాస పెరుమాళ్ మాట్లాడుతూ రామానుజులవారంటే కేవలం ఒక పీఠాధిపతో లేక మతాచార్యుడో కాదని ఆయనొక సంఘ సంస్కర్త అని వివరించారు. లింగపాలెం మండలంలో స్థాపించిన తమ భాగవత సదనం కూడా రామానుజ సమతా సిద్ధాంతంపైనే నడుస్తున్నట్టు చెప్పారు. భక్తులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు (టూటౌన్): దుకాణాల్లో పనిచేసే వారు, స్వచ్ఛంద సంస్థలు కార్మిక చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవనంలో దుకాణాల్లో పనిచేసే వారు, స్వచ్ఛంద సంస్థలకు శుక్రవారం కార్మిక చట్టాల పైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ దుకాణాలు, సంస్థలు, కర్మాగారాలు, సంస్థలు, కర్మాగారాల్లో బాలలతో పని చేయించరాదని అన్నారు. అక్కడక్కడా ఉన్న బాల కార్మిక వ్యవస్థను సమష్టిగా అరికట్టాలని అన్నారు. దుకాణాలు, సంస్థల్లో పని చేసే కార్మికులకు పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా వేతనాలు చెల్లించాలని అన్నారు. కార్మికుల వివరాలను ఈశ్రం పోర్టల్ నందు నమోదు చేసుకోవాలని తద్వారా సంక్షేమ పథకాలను పొందటం సులభతరం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాదు అన్నారు. కార్యక్రమంలో సహాయ లేబరు అధికారి గోపాలకృష్ణ, రమణ, న్యాయవాది పి.రత్నరాజు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలని కోరుతూ ఆర్‌యూటీపీ (రూట) జిల్లా అధ్యక్షుడు సయ్యద్ జీలాని తన బృందంతో శుక్రవారం డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రెండో అధికారిక భాష అయిన ఉర్దూను కాపాడాలని, ఉర్దూ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులనే నియమించాలని కోరారు. వేరే యూనియన్ ఉర్దూ పాఠశాలలో తెలుగు విద్యార్థులు ఉన్నారని తెలుగు పోస్టులు ఇవ్వాలని కోరుతున్నారని, అలాగే తెలుగు స్కూల్స్‌లో కూడా చాలామంది ముస్లిం విద్యార్థులు ఉండడంతో ఉర్దూ పోస్టులు కూడా ఇవ్వాలి డిమాండ్ చేశారు. ఎండీ ఖలీల్, ఎస్‌డీ సల్మాన్, ఎండీ షఫీ, ఎండీ సిరాజ్, అబ్దుల్ రజాక్ తదితరులు ఉన్నారు.

పంటల ఒబ్బిడికి పాట్లు



పోలవరంలో ఆరబెట్టిన తడిచిన ధాన్యం, మొక్కజొన్న పంట

పోలవరం రూరల్: ఆరుగాలం కష్టించి పండించిన పంటను వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వాతావరణ మార్పులతో ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. ఏ పూట ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. రోజూ సాయంత్రానికి వాతావరణంలో మార్పు వచ్చి వర్షం పడుతుంది. దీంతో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటలను గుట్టలుగా చేర్చి తడవకుండా బరకాలు కప్పుతున్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రం ద్వారా మిల్లులకు తరలించేందుకు కొంత జాప్యం జరగడంతో పాటు సంచులు కూడా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఆరబెట్టిన ధాన్యం తడిచిపోవడంతో శుక్రవారం ఉదయం రోడ్డుపై ఆరబెట్టి బస్తాల్లోకి ఎక్కించుకునే పనులు చేపట్టారు. కొందరు ధాన్యాన్ని మిల్లులకు తోలుకుంటున్నారు.